క్లుప్తంగా

లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం



విశేషాలంకరణలో లక్ష్మీదేవి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని లక్ష్మీదేవి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు కె.ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు. కుంకుమార్చన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పుట్టా శ్రీను తదితరులు పర్యవేక్షించారు.

రోడ్డు పక్కన తుప్పలు తొలగించాలి



గొల్లపాలెం-తణుకువాడ గ్రామాల మధ్య దట్టంగా పెరిగిన ముళ్లపొదలు

కాజులూరు: గొల్లపాలెం, తణుకువాడ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగి ఉన్న తుప్పలను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రహదారిలో ఇటీవల కురిసిన చెదురుమదురు వర్షాలకు గొల్లపాలెం నుంచి దేగలపేట మధ్యలో రహదారి పొడవునా ఇరువైపులా దట్టమైన ముళ్లపొదలు, గడ్డి మొక్కలు పెరిగి ఉన్నాయి. ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఈ ముళ్ల పొదల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఒకదానికి ఒకటి కనిపించడం లేదు. దీనికి తోడు రోడ్డుపై దగ్గర దగ్గరగా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. మలుపులు, తుప్పల కారణంగా వాహన చోదకులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పక్కల ఉన్న పొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



తాము వేసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో కపిలేశ్వరపురం గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి, రీసోర్స్‌పర్సన్ డి.తారక్ వంశీ ఆధ్వర్యంలో గ్రంథాలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో గ్రామంలోని వివిధ తరగతులకు చెందిన 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో కెరటాల ఉధృతి



అంతర్వేదిలో ఎగసిపడుతున్న కెరటాలు

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో అల్పపీడన ప్రభావానికి అమావాస్య ఘడియలు తోడవ్వడంతో సముద్ర కెరటాల ఉధృతి మంగళవారం పెరిగింది. కెరటాలు సాధారణ స్థాయికి మించి ఎగసి పడుతున్నాయి. దీంతో కెరటాలు తీరాన్ని దాటుకుని సుమారు 200 మీటర్ల వరకూ చొచ్చుకు వస్తున్నాయి. కెరటాల ధాటికి తీరాన్ని ఆనుకుని ఉన్న పల్లపు ఏరియాలు ఉప్పునీటితో జలమయం అవుతున్నాయి.

అణువణువూ.. పడగ నీడ

- గోదావరి తీర గ్రామాల్లో విష సర్పాల సంచారం
- నానాటికీ పెరుగుతున్న మరణాల కేసులు
- పీహెచ్‌సీల్లో అందుబాటులో యాంటీ స్నేక్ వీనం



రత్నకుమారి, వైద్యాధికారి, అంగర



కపిలేశ్వరపురంలోని ఓ ఇంటిలో చేరిన పాము(ఫైల్)

కపిలేశ్వరపురం: అల్లవరం మండలం గుండెపూడి పంచాయతీ పోతులవారిపేటలో పది రోజుల క్రితం స్నానం చేస్తుండగా పాము కరవడంతో వృద్ధురాలు జంగా పెదలక్ష్మి మృతిచెందింది. ఈ ఏడాది ఏప్రిల్ 29న తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఇనుగంటివారిపేటకు చెందిన ఉపాధి కూలీ కానేటి శాంతమ్మ పని ప్రదేశంలో పాముకాటుకు గురైంది. ఈ ఏడాది మార్చి 21న పొలంలో పని చేస్తుండగా రైతు అనపర్తి కృష్ణ పాముకాటుకు గురై, కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన వారు అనేక మంది ఉన్నారు. కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతుండటంతో జనావాసాల్లోకి పాములు చేరుతున్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో కోతలు పూర్తికావడంతో అక్కడి నుంచి పాములు, రహదారులు, నివాస ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. పాముకాటుకు గురైతే.. సకాలంలో స్పందించడమనేది అత్యంత కీలకం. పాముకాటు వల్ల కలిగే దుష్పరిణామాలు, చికిత్స విధానం, ఆస్పత్రుల్లో చికిత్స తీరు తదితర అంశాలపై అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి వివరించారు.

క్షేత్ర స్థాయిలో పాముల బెడద

కపిలేశ్వరపురం మండలం అంగరలోని దళితవాడ సమీపంలో గతేడాది మే నెలలో ఓ పాము నివాస ప్రాంతంలోకి చేరింది. అప్రమత్తమైన స్థానికులు సర్పాన్ని హతమార్చి, ప్రాణాలను కాపాడుకున్నారు. నల్లూరులో 2021 నవంబర్ 29న పాము కరవడంతో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు బి.నాగేంద్ర మృతి చెందాడు. గతంలో కోరుమిల్లి గోదావరి గట్టుపై పచ్చగడ్డిని కోస్తుండగా గ్రామానికి చెందిన వృద్ధుడు సుంకర నాగేశ్వరరావు పాముకాటుకు గురై చనిపోయారు. నల్లూరులోని చిన్నారిని విషసర్పం కరవడంతో అంగర పీహెచ్‌సీలో చికిత్స అందించారు. క్షేత్ర స్థాయిలో విష సర్పాల ప్రభావానికి అనేక మంది గురవుతున్నారు. ఎటు వెళ్లినా.. ఎక్కడ పాము నక్కి ఉందోనన్న భ్రాంతితో ప్రజలు హడలిపోతున్నారు. కె.గంగవరం మండలం శేరిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, కేదారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంకలు పూర్తిగా గోదావరి నదిలో ఉన్నాయి. స్థానికులు నిత్యం లంక పొలాల్లో పని చేస్తుంటారు. కోరుమిల్లి, వాకతిప్ప, కపిలేశ్వరపురం, తాతపూడి, శేరిలంక, కోటిపల్లి, కూళ్ల శివారు ప్రాంతాల్లో విష సర్పాల సంచారం అధికంగా ఉంది. వాకతిప్ప, అచ్యుతాపురం, అంగర, వానపల్లి, కొత్తపేట పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనం మందు అందుబాటులో ఉన్నట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు తెలిపారు.

పాముకాటు లక్షణాలు

కరిచిన పామును బట్టి బాధితునిలో లక్షణాలు కనిపిస్తాయి. కాటు సమయంలో బాధితుడి శరీరంలోకి ఎక్కిన విషం పరిమాణాన్ని బట్టి ప్రమాద తీవ్రత ఉంటుంది. నల్లతాచు పామైతే విష ప్రభావం త్వరితంగా, సాధారణ తాచు పాము ప్రభావం కాస్త ఆలస్యంగా ఉంటుంది. విష సర్పం కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకుపోతాయి. గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తుతుంది. చొంగ కారవచ్చు. కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

ఆస్పత్రిలో ఇలా..

కాటు వేసిన సర్పం విషపూరితమైనదా, కాదా అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు వైద్యుడు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. తీవ్రతను బట్టి విషం విరుగుడు మందు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనం)ను ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. బాధితునికి శక్తి కలిగేందుకు సెలైన్ ఇస్తూ, ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా చికిత్స అందజేస్తారు. మరణం సంభవిస్తే మెడికో లీగల్ కేసును నమోదు చేస్తారు.

ప్రథమ చికిత్స

పాము కాటు పైభాగంలో కట్టుకట్టాలి. ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు ఆలస్యమవుతుంటే మధ్య మధ్యలో కట్టును వదులు చేసి, మళ్లీ కడుతుండాలి. కాటు వద్ద విషాన్ని పిండాలి. గుండె వేగం పెరగకుండా జాగ్రత్త పడాలి. కాటు వేసిన శరీర భాగాన్ని గుండెకంటే కిందకు ఉండేలా ఉంచాలి. కాటుకు గురైన వ్యక్తి నిద్రపోతే అపస్మారక స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. మెలకువగానే ఉంచి త్వరితగతిన ఆస్పత్రికి తరలించాలి. విషానికి విరుగుడైన ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనం) మందు ఉండే ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించాలి.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ సెక్షన్‌లోని పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో ఉన్న పొడైన టవర్లు తొలగించి కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా 33/11 కేవీ, 11 కేవీ లైను క్రాసింగ్ ఉండటం కారణంగా ద్రాక్షారామ సెక్షన్‌లోని 11 కేవీ తాళ్లపాలెం ఫీడర్ మీద ఉన్న నెలపర్తిపాడు, వెలంపాలెం, గణపతినగరం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రజలు సద్వినయోగం చేసుకోవాలని గొల్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.వీరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఇళ్లపై నిర్మించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ సిస్టంను మూడు విభాగాలుగా సబ్సిడీపై ప్రజలకు అందిస్తుందన్నారు. మొదటి కేటగిరిలో ఒక కేవీ యూనిట్ విద్యుత్ సిస్టంకు రూ.30 వేలు, రెండు కేవీకి రూ.60 వేలు, మూడు కేవీకి రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ పథకంపై గ్రామాల వారీగా డ్వాక్రా యానిమేటర్లకు, పంచాయతీరాజ్ సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



నిరవధిక సమ్మె చేస్తున్న మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీ బోస్, సూర్యప్రకాశ్

రామచంద్రపురం: పురపాలక సంఘం పరిధిలో లైటింగ్, వాటర్ సప్లయి విభాగాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్షణం కనీసం వేతనంగా రూ.25 వేలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత 90 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మెను చేస్తున్న మున్సిపల్ వాటర్ సప్లయి, లైటింగ్ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఎంపీ బోస్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్‌లు సమ్మె శిబిరం వద్దకు వెళ్లి సంఘీభావం తెలిపారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పురపాలక సంఘ ఉద్యోగులకు ప్రభుత్వం ద్వారా వేతనాలు అందించే విధానాన్ని తీసుకువచ్చారన్నారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా కాకుండా అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌ను తీసుకువచ్చి వారికి దాని ద్వారా జీతాలు అందే విధంగా చేశారన్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే తక్షణంగా వీరికి రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. కాగా సర్వీస్ ఆధారంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. పురపాలక పరిధిలో ఆయా విభాగాల్లో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న సిబ్బంది ప్రభుత్వం అందించే ఎటువంటి సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారని, కనీస వేతనం ఇవ్వటంతో పాటుగా ప్రభుత్వం అందించే వివిధ సంక్షేమ పథకాలకు వీరిని అర్హులుగా గుర్తించాలని ఎంపీ బోస్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరల కారణంగా వీరికి ప్రస్తుతం ఇస్తున్న రూ.13 వేలు ఏమాత్రం కుటుంబ పోషణకు సరిపోదన్నారు. అత్యవసర సర్వీసు విభాగాల్లో నిత్యం పనిచేస్తున్న వాటర్, లైటింగ్ సిబ్బంది డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కో ఆర్డినేటర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ అత్యవసర విభాగాల్లో పనిచేస్తున్న వాటర్, లైటింగ్ అవుట్ సోర్సింగ్ సిబ్బంది గత 9 రోజులుగా సమ్మె చేస్తున్న ఈ ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం దిగి వచ్చిన న్యాయమైన వీరి డిమాండ్లను పరిష్కరించాలని సూర్యప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, తదితర పార్టీ నేతలు పాల్గొన్నారు.

యోగాతో జీవితానికి మేలు



మండపేట మున్సిపల్ కార్యాలయంలో యోగాసనాలు వేస్తున్న కమిషనర్, ఉద్యోగులు

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మానవ జీవితానికి యోగా ఎంతో మేలు చేకూరుస్తుందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ టీవీ రంగారావు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ఛైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ, జూన్‌లో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు యోగాపై శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి యోగా శిక్షణ ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్లు డి.పవన్‌కుమార్, బి.ఆంజనేయులు, రెవెన్యూ అధికారి జేవీఎస్ శాస్త్రి, జేఏఓ సత్యనారాయణమూర్తి, మెప్మా సీఎంఎం సుజాత, సీఓలు మహాలక్ష్మి, వీరలక్ష్మి, రాంజీ, ఆర్పీలు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



యోగా శిక్షణలో పాల్గొన్న ఈఓ, స్థానికులు

జూన్ 21 వరకు భీమేశ్వరాలయంలో యోగా శిక్షణ

రామచంద్రపురం రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమం ద్వారా భీమేశ్వరస్వామి ఆలయంలో జూన్ 21 వరకు రోజూ ఉదయం 6 గంటలకు యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ, ఏసీ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో యోగ శిక్షకులు ఆదిమూలం రామారావు, కోల శ్రీనుల నేతృత్వంలో యోగ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పురోహితులు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. వచ్చే నెల 21 వరకు జరుగనున్న యోగ శిక్షణలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

ప్రతి ఒక్కరూ సైనికులకు అండగా నిలవాలి



ద్వారపూడిలో తిరంగా యాత్రలో పాల్గొన్న విద్యార్థులు, గ్రామస్తులు

కపిలేశ్వరపురం (మండపేట): దేశ సరిహద్దు రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న భారత సైనికులకు ప్రతి భారతీయుడు అండగా నిలవాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాలిక రమణ అన్నారు. మంగళవారం ద్వారపూడిలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెహల్గాంలో పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ముష్కరులను మట్టుపెట్టిన సైనికుల చర్యను విజయోత్సవంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల నుంచి గ్రామ వీధుల్లో ఎన్‌సీసీ విద్యార్థులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.విజయజ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయులు భ్రమరాంబ, నాయకులు సత్తి సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, కంకటాల మురళీకృష్ణ, కోన సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ రాయి వీర్రాజు, మానవతా సంస్థ అధ్యక్షుడు పల్లా సన్యాసిరావు, డాక్టర్ నాయుడు, తెల్లాకుల శివప్రసాద్, టీకే వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

ఆలమూరు: చొప్పెల్ల గ్రామదేవత కనకమహాలక్ష్మి అమ్మవారి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు కాశ్యకూరి కాశీ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య ఆలయ పురోహితుడు కాశ్యకూరి రవితేజశర్మ బ్రహ్మత్వంలో శైవాగమ పద్ధతిలో ఈ విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది. దాతల సహకారంతో నిర్మించిన అమ్మవారి నూతన ఆలయంలో ఈనెల 31న విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని ఆలయ కమిటీ మంగళవారం తెలియజేసింది. అలాగే భారీ అన్నసమారాధనను ఏర్పాటు చేయనున్నామన్నారు.

రావులమ్మకు సేవ

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత రావులమ్మ అమ్మవారి జాతర పురస్కరించుకుని ప్రసాద్‌నగర్ కాలనీ వాసులు అమ్మవారి సేవను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పూజా ఘటాలకు హారతులిచ్చి, చలివిడి పానకాలు, ముడుపులు, మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సేవలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. యువకుల కేరింతల నడుమ అమ్మవారి సేవ వైభవంగా సాగింది.

రెండో రోజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు శివారు శిరసవల్లి సావరంలో కొలువైన కొమార మ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను మంగళవారం గ్రామ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి వేదపండితులు విశేష పూజలు జరిపారు. వేదపండితులు, రుత్వికుల వేదఘోష మధ్య అమ్మవారి ప్రాంగణం శోభిల్లింది. అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నసమారాధన జరిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే రైతుల కొంపముంచింది

కాజులూరు: ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే మండల గ్రామాల్లో ఈ ఏడాది దాళ్వా పంట వర్షాల బారిన పడి రైతుల కొంప ముంచిందని సంఘం నాయకుడు, తణుకువాడ పీఏసీఎస్ మాజీ వైస్ ఛైర్మన్ తాడి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం శలపాకలో ఆయన మాట్లాడుతూ వర్షాల సమయానికి మండల గ్రామాల్లో సుమారు 80 శాతం వరిపొలాల మాసూళ్లు పూర్తయ్యాయన్నారు. అయితే ప్రభుత్వం మద్దతు ధర 75 కేజీల బస్తాకు రూ.1725 ప్రకటించినప్పటికీ రైతుసేవా కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో మిల్లర్లు దళారుల ద్వారా రూ.1550 కే కొనుగోలు చేసేవారన్నారు. దీంతో రైతులు అంత తక్కువ ధరకు అమ్మకాలు చేయలేక ధాన్యం పొలంగట్లపైన, పొలాల్లోని దిమ్మెలపైనా రాశుల రూపేణా ఉంచారన్నారు. ఆ సమయంలో రోజుల తరబడి వర్షాలు కురవడంతో కోత కోయని పంటతో పాటు రాశుల రూపేణా ఉన్న ధాన్యం పంట నీట తడిసిందన్నారు. తీరా ఇప్పుడు పంట తడిసి రంగు మారడంతో మిల్లర్లు 75 కేజీల బస్తా రూ.1400 వందలకే అడుగుతున్నారన్నారు. దీంతో రైతులు మరింత నష్టపోవలసి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి భారీ వర్షాల కారణంగా నీట తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు నల్లమిల్లి ఆదిరెడ్డి, టేకుమూడి దర్గారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళనకు సంఘీభావం



కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): ఒకటిన్నర దశాబ్దాలుగా మున్సిపాలిటీ పరిధిలో విశేష సేవలందిస్తున్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళనకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం మంగళవారం నాలుగో రోజుకు చేరింది. ఛైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ, అత్యవసర విభాగంలో కార్మికులు అందిస్తున్న సేవలు పట్టణ ప్రజలకు మేలు చేస్తున్నాయన్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో వారి వేతనాలను మానవతా దృక్పథంతో ప్రభుత్వం పెంచాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న వారిని శాశ్వత ఉద్యోగులు పరిగణించి, ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న ప్రతి సదుపాయాన్ని వర్తింపజేయాలన్నారు. పట్టణ ప్రజాప్రతినిధిగా కార్మికులకు సంఘీభావాన్ని తెలపడాన్ని కర్తవ్యంగా భావిస్తున్నానన్నారు. కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ మాట్లాడుతూ, కార్మికుల కోర్కెలు న్యాయసమ్మతమైనవని, వారి సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. తమకు సంఘీభావం తెలిపిన ఛైర్మన్, కౌన్సిలర్లకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ ఏడాదైనా సాయం అందేనా?

- త్వరలో ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్
- కూటమి పాలనలో 'అన్నదాత సుఖీభవ'కు ఎదురు చూపులు



పలివెలలో కళ్లంలో తడిసిన ధాన్యం (ఫైల్)

కొత్తపేట: ఆరుకాలం కష్టించి పంటలు సాగు చేసేవాడు రైతు.. అలాంటి రైతు పరిస్థితి నేడు దయనీయంగా మారింది. పంటలకు క్రిమి కీటకాలలు, చీడపీడలతో దిగుబడి తగ్గి నష్టపోవడం, పండింది పండినట్టుగా ప్రభుత్వం కొనకపోవడం, జాప్యం చేయడం, ఈలోపు వర్షాల కారణంగా పంట దెబ్బతినడం, ప్రకృతి వైపరీత్యం ఇలా ఏదో ఒక కారణంతో రైతులు నష్టపోతున్నారు. అలాంటి రైతులకు ప్రభుత్వం నుంచి కొంత మేరకు ఆర్థిక అండదండలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ విధంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు రైతు భరోసా పేరుతో ఆర్థిక అండదండలు అందించి రైతులను ఆదుకుంది. కానీ నేటి కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తి అయినా, మళ్లీ ఖరీఫ్ సీజన్ వస్తున్నా రైతులకు అన్నదాత సుఖీభవ ఊసెత్తడం లేదు. గత ఖరీఫ్, రబీలో ఎలాగూ ఇవ్వలేదు. ఈ ఖరీఫ్‌లోనైనా రైతులకు అన్నదాత సుఖీభవ అందుతుందా.. అని రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

జగన్ పాలనలో రైతు పథకాలు

2019 నుంచి 2024 వరకూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో క్రమం తప్పకుండా రైతు ప్రయోజన పథకాలు అమలు చేస్తూ రైతులను ఆదుకున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ అధినేత రైతులకు భరోసా హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన వెంటనే రైతు భరోసాతో పాటు ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఏ సీజన్‌కు ఆ సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేసి రైతులను ఆదుకున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల కష్టాలు చూసి రైతులకు అండగా ఉండాలని భావించింది. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన ఏడాది నుంచి రైతులకు రైతు భరోసా అందించింది.

అన్నదాత సుఖీభవ కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది పూర్తవుతోంది. ఎన్నికల్లో రైతులకు రూ.20 వేలు అన్నదాత సుఖీభవ రూపంలో రైతులకు ఏటా అందిస్తామని చెప్పారు. కానీ నేటికి ఏడాది పూర్తయింది. రెండో సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ మరో నెలలో ప్రారంభం కానుంది. అయినా నేటికి రైతుల ఖాతాకు ఒక్క పైసా పడలేదు. అలాగే ప్రభుత్వం ఇస్తుందన్న ఆలోచన కలగడం లేదు. దీంతో రైతులు అసలు కూటమి పాలనలో రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం అందుతుందా అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు.

రైతులకు అన్యాయం

2024 ఖరీఫ్, రబీ సీజన్లో వరి పంట సాగు చేసిన రైతులు చాలా వరకు నష్టపోయారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో రైతుల నుంచి పంట కొనుగోలుకు సంబంధించి టార్గెట్‌లు పెట్టి కొనుగోలులో జాప్యం చేసింది. టార్గెట్‌ల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయడం వలన ధాన్యం ఎక్కువ రోజులు కళ్లాల్లోనే ఉండిపోవడం, అకాల వర్షాలు కురవడం, ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూశారు.